సీరియల్-

ఎడారికోయిల

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

"సారీ సుస్మితా అయాం వెరీ సారీ ... పశువులా ప్రవర్తించాను" అన్నాడు సిద్దార్థ ఆమె ముఖంలోకి చూడలేక.

అయితే ఇతనికంతా గుర్తుందన్నమాట!

సుస్మిత పెదాలమీద, చిరునవ్వు మెరిసింది. సిద్దార్థ ఆమెవైపు చూసివుంటే నిర్ఘాంతపోయి వుండేవాడు ఆమె నవ్వుకోవటం చూసి.

"మీరు మనిషిలాగే ప్రవర్తించారు" అన్నది కూల్ గా.

"సుస్మితా, జరిగిందానికి నేను బాధపడుతున్నాను" అన్నాడు సిద్దార్థ.

"నేను బాధపడటం లేదు."

"అంటే!?"

"అదంతే. జరిగిన తప్పులో నాకూడా సగం బాధ్యత వున్నది. రెండు చేతులు కలిస్తేనే కదా చప్పట్లు!"

"కాని, నేనేదో మైకంలో, ఒళ్ళు తెలియని పరిస్థితిలో.... అలా ప్రవర్తించాను."

"నాకు తెలుసు. మనం తిన్న పళ్ళు ఈ విధంగా తమ ప్రతాపం చూపించాయి."

"ఏది యేమైనా తప్పు జరిగిపోయింది. అందుకు నా నుంచి నీకు న్యాయం జరగాలి. నీకు న్యాయం చేయటానికి సిద్ధంగా వున్నాను."

"ఏం చేస్తారు?"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

కోటి వీణలు శృతిబద్ధంగా చెవుల్లో మోగుతున్న అనుభూతి చెందింది సుస్మిత.

"మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా!"

"అవును. నీకు జరిగిన అన్యాయాన్ని నేను చేసిన తప్పును సరిదిద్దుకోవటానికి అదే సరైన మార్గం!"

ఒక్క క్షణం మౌనంగా అతని ముఖంలోకి చూసింది సుస్మిత. "అంటే, నాకు అన్యాయం జరిగింది కాబట్టి నన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు. అంటే కేవలం జాలితోను. సానుభూతితోను సిద్ధమవుతున్నారు. అంతే కదూ!?"

ఇబ్బందిగా చూశాడు మెతంక సిద్ధార్థ.

"నా ఉద్దేశ్యం...." ఏదో చెప్పబోయాడు. మాట లకి తడుముకోవలసి వచ్చింది.

"మీకు నామీదున్నది కేవలం సానుభూతి మాత్రమే! నా మీద మీకు మరెలాంటి అభిప్రాయం లేదు. అవును కదూ!?"

సిద్దార్ధ మౌనం వహించాడు.

'నిన్ను ప్రేమిస్తున్నాను. అందుకే నిన్ను కోరుకుంటు

న్నాను! అని అతడంటాడేమోనని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తోంది సుస్మిత.

కాని ఆ సమయానికి సిద్ధార్థ కళ్ళలో దివ్య మెదుల్తోంది. 'నీకు ద్రోహం చేస్తున్నాను దివ్యా! నన్ను క్షమించు' అనుకొంటున్నాడు మనసులో.

అతని మనసుని కాగితంమీది అక్షరాలు చదివినంత సునాయాసంగా చదివేసింది సుస్మిత. అతని మనసులో తను లేదని తెలిసిపోయింది అలా అనుకోగానే ఆమె కన్నె హృదయం బాధగా వేదనగా మూలిగింది.

“చూడండి సిద్ధార్థా! మనసులేని మనువును నేను కోరుకోవటం లేదు. జరిగిందేదో జరిగిపోయింది. దాన్ని ఇద్దరం మరచిపోదాం. కాని మిమ్మల్ని ఒక్క కోరిక కోర్తున్నాను. మీ వలన నాకేదో అన్యాయం జరిగిపోయిందన్న విషయం మీ మనసులోనికి రానివ్వకండి. జరిగింది మర్చిపోండి!” తేలిగ్గా నవ్వేస్తూ అన్నది సుస్మిత.

ఆమె నవ్వులో జీవం లేకపోవటం సిద్ధార్థ గుర్తించాడు. ఆమె ముఖంలోకి చూడటానికి ధైర్యం చాల్లేదతనికి.

సుస్మిత మళ్ళీ తనే అన్నది: “చూడండి సిద్ధార్థా! మనమిప్పుడున్నది జనసంచారం లేని కటిక ఎడారిలో. మనం బతికి బయటపడతామో లేదో ఆ భగవంతుడికే తెలియాలి తప్ప, మనకి తెలీదు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో మనం పెళ్ళి గురించి మాట్లాడుకోవటం వింతగా లేదూ!? అంతే మనిషి యెంతటి ఆశావాదో నాకిప్పుడర్థమయింది. అశాశ్వతమైన మన జీవితాల్ని శాశ్వతమైన వివాహబంధంతో కట్టిపడెయ్యాలని పిచ్చిలెక్కలు వేస్తున్నాము........పడుకోండి, తెల్లారి మన ప్రయాణం

సాగించువాం."

అప్పుడు నోరు విప్పాడు సిద్ధార్థ. "నువ్వు నడవగలిగితే మనం ఇప్పుడే ప్రయాణం చెయ్యటం మంచిది. తెల్లారితే యెండ వేడిమికి తట్టుకోలేం. దాహం, ఆకలి...."

సుస్మిత అతను ఆలోచనలో ఆగిపోవటం చూసి నవ్వుకొన్నది. "కరెక్ట్! వెన్నెల పుచ్చపువ్వులా ఉన్నది. ఇప్పుడే మనం ప్రయాణం కొనసాగిస్తే తెల్లవారేసరికి యేదైనా జనసంచారమున్న ప్రాంతం చేరుకోగలమేమో! ప్రయత్నిద్దాం" అన్నది.

ఇద్దరు అప్పటికప్పుడు బయల్దేరారు.

* * *

ఓ గంట పాటు ఇద్దరు అలాగే ఇసకలో అడుగుతీసి అడుగు వేస్తూ నడిచారు.

వాళ్ళకి దూరంగా ఇసక గాల్లోకి రేగిన సూచన కనిపించింది.

'మళ్ళీ మరో ఇసక తుఫాను కాదుగదా' అనుకున్నాడు సిద్ధార్థ.

కాసేపట్లోనే అదేమిటో తెలిసిపోయింది వాళ్ళకు.

ఒకదాని వెంట మరొకటి నాలుగు ఒంటెలు కనిపించాయి. వాటిమీద మనుషులున్నారు.

ఆనందంగా అరిచింది సుస్మిత. "మనుషులు! ఫరవా లేదు, వాళ్ళు మనకి సాయపడతారు" అన్నది.

సిద్ధార్థ తల పంకించాడు.

"వేగంగా అటు నడువు. వాళ్ళు కనుమరుగైపోకుండానే మనం వాళ్ళ నందుకోవాలి!" అన్నాడు.

ఇద్దరు ఇసకలో పడుతూ లేస్తూ ఒంటెలు పయని

స్తున్నవైపు నడవసాగారు.

ఒంటెలు బాగా దగ్గరయ్యాయి. దానిమీదున్న మనుషులు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నారు.

సిద్ధార్థ ఎలుగెత్తి పిలుస్తూ చేతులెత్తి వాళ్ళవైపు సంకేతం పంపించాడు ఆగమని.

ఒంటెలు ఆగాయి. వాటిమీదున్న వ్యక్తులు సుస్మితను, సిద్ధార్థను విస్మయంగా చూశారు.

సిద్ధార్థ వాళ్ళను చూస్తూనే ఉలిక్కిపడ్డాడు. వాళ్ళు చాలా కర్కశంగా మొరటుగా వున్నారు.

సుస్మిత వాళ్ళను చూడగానే, ఉత్సాహమంతా నీరు కారిపోగా అలాగే నిల్చుండిపోయింది.

వాళ్ళేదో అడిగారు. ఆ భాష సిద్ధార్థకి అర్థంకాలేదు. హిందీలా ధ్వనించిందిగాని, హిందీ కాదు. ఎవరు మీరని అడుగుతున్నారని అర్థం చేసుకున్నాడు.

విమానం నుంచి పడిపోయామని అర్థం వచ్చేలా సైగలు చేస్తూ హిందీలో చెప్పాడు.

వాళ్ళకి అర్థమయినట్టే కనిపించింది. మళ్ళీ యేదో అడిగారు. ఎక్కడికి పోవాలని అడుగుతున్నట్టు గ్రహించాడు సిద్ధార్థ.

“మమ్మల్ని యేదయినా గ్రామానికి చేర్చండి” అన్నాడు సిద్ధార్థ అభినయించి చూపుతూ.

వాళ్ళు అంగీకరించారు.

ఓ వ్యక్తి సుస్మితని ఒంటెమీదికి చేదుకున్నాడు. మరో వ్యక్తి సిద్ధార్థని యెక్కించాడు, తన ఒంటె మీద.

వాళ్ళు తామనుమానించినట్టు క్రూరత్వమున్న మనుషులు కాదని సుస్మిత, సిద్ధార్థ గ్రహించారు.

అయితే వాళ్ళ అంచనా ఘోరంగా తప్పిందని వాళ్ళి ద్దరికీ త్వరలోనే తెలిసివచ్చింది.

*　　　*　　　*

ముందుగా రెండు ఒంటెలు నడుస్తున్నాయి.

మూడో ఒంటెమీద సిద్ధార్థ, నాలుగోదానిమీద సుస్మిత కూచుని వున్నారు.

ఎందుకో సిద్ధార్థవైపు చూసిన సుస్మిత ఒక్కసారిగా కెవ్వున అరిచింది.

"సిద్ధార్థా! కిందికి దూకెయ్యి" అని గొంతెత్తి చెప్పింది

సిద్ధార్థ చటుక్కున తన వెనుక కూచున్న వ్యక్తివంక చూశాడు. అతని చేతిలో తళుక్కుమని మెరిసిన పొడ వాటి కత్తిని గుర్తించాడు సిద్ధార్థ.

అయితే భయపడి కిందికి దూకెయ్యలేదు సిద్ధార్థ. అతని చెయ్యిని చటుక్కున మెలిపెట్టి మరో చేత్తో ఆ కత్తిని లాక్కున్నాడు.

ఆ వ్యక్తి సిద్ధార్థ గుండెలమీద తన్నాడు.

ఆ వూపుకి యిద్దరు ఒంటెమీది నుంచి యిసకలో పడ్డారు.

ముందు ఆ వ్యక్తి, అతనిమీద సిద్ధార్థ పడ్డారు. ఆ అదురుకు సిద్ధార్థ చేతిలోని కత్తి యెగిరి యిసకలో పడింది.

ఈలోపల తన నడుమును బంధించబోతున్న వ్యక్తి చేతుల్లోంచి లాఘవంగా విడిపించుకుని కిందికి దూకేసింది సుస్మిత. వాళ్ళ పన్నాగమేమిటో ఆమె కర్థమయి పోయింది.

మెరుపు వేగంతో సిద్ధార్థకి సాయంగా అతనివైపు

పరుగెత్తింది. ఇసకలో పడిపోయిన కత్తిని చేతచిక్కించుకుంది.

ఈ లోపల ఆమెని ఒంటెమీద ఎక్కించుకున్న వ్యక్తి పరుగున వచ్చి ఆమెను వెనుకనుంచి వాటేసుకుని తన మీదకు లాక్కోబోయాడు.

అంతే! మహావేగంగా కత్తిని అతని పొట్టిలో దించేసింది సుస్మిత. ఒక్కసారి కాదు నాలుగైదుసార్లు.

ఆ మనిషి పర్వతంలా నేలకూలాడు.

ఈ లోపల సిద్ధార్థ తనని చంపబోయిన వ్యక్తిని పొత్తికడుపులోను, తొడల మధ్య బలంగా తన్ని ఇసకలో పొర్లించాడు.

ఇంతలో ముందు వెళ్తున్న రెండు ఒంటెలు ఆగిపోయాయి. వాటిమీదున్న మనుషులిద్దరు చేతుల్లో పొడవాటి కత్తులు ధరించి వెనక్కి పరుగెత్తుకుని వచ్చారు.

వాళ్ళు దగ్గరికొచ్చేంతలో గుప్పెళ్ళతో ఇసక తీసుకుని సూటిగా వాళ్ళ కళ్ళలోకి చిమ్మింది సుస్మిత.

జరిగిందేమిటో వాళ్ళు గ్రహించేలోపల వాళ్ళిద్దర్నీ కాళ్ళు అడ్డుపెట్టి నేలమీద పడగొట్టాడు సిద్ధార్థ. ఈ లోపల వాళ్ళ చేతుల్లోని కత్తులు లాగేసుకున్నారు సిద్ధార్థ, సుస్మిత.

అయితే సరిగ్గా అప్పుడే ఊహించని ఘోరం జరిగిపోయింది.

సిద్ధార్థ వల్ల పొత్తికడుపులో తన్నులు తిని చచ్చినట్టు పడివున్న వ్యక్తి మెరుపువేగంతో సిద్ధార్థను సమీపించి అతని వెన్నులో కత్తి దింపబోయాడు.

సిద్ధార్థ తప్పించుకునే వ్యవధిలేదు!

సుస్మిత ముందుగా ప్రమాదాన్ని గుర్తించి ఆ వ్యక్తిని తన చేతిలోని కత్తితో అటకాయించింది. తన ప్రయత్నం విఫలమయిందన్న కోపంలో ఆ వ్యక్తి సుస్మిత గుండెల్లో బలంగా కత్తితో పొడిచేశాడు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

సుస్మిత కెవ్వున అరిచి నేలకూలిపోయింది.

ఆమె ఆర్తనాదం వింటూనే సిద్ధార్థ వెనుదిరిగి ఆమె గుండెల్లో కత్తి దింపిన వ్యక్తిని పొడవాటి కత్తితో అందిన చోటల్లా నరికేశాడు.

ఈ లోపల కళ్ళలో ఇసక పడ్డంవల్ల నేలమీద పడి పోయిన యిద్దరు మనుషులు లేచి సిద్ధార్థమీద దాడి చేశారు.

రెండు చేతుల్లోను రెండు పటాకత్తులు ధరించి వున్న సిద్ధార్థ వాళ్ళిద్దరిమీదికి లంఘించాడు.

నిరాయుధులుగా వున్న ఆ వ్యక్తులిద్దరు తలలు మొండేల నుంచి వేరైపోగా హాహాకారాలు చెయ్యకుండానే నేలకూలిపోయారు.

ఒక్క అంగలో సుస్మితను చేరుకుని, నేలవాలి పోయిన ఆమె శరీరాన్ని తన ఒడిలోకి తీసుకుని "సుస్మితా, సుస్మితా...." అంటూ ఆక్రందన చేశాడు సిద్ధార్థ.

బరువుగా వాలిపోతున్న కనురెప్పల్ని అతి ప్రయత్నం మీద పైకెత్తి అతని వంక చూసింది సుస్మిత.

అప్పటికే ఆమె ప్రాణాలు కళ్ళలోకి వచ్చేశాయి. అయినా యే శక్తో యింకా ఆమెకు మాట్లాడగలిగే ఓపిక నిచ్చింది.

"ఏమండీ....మీరు క్షేమంగానే వున్నారు కదూ!? వాళ్ళు నలుగురు చచ్చా....రా?" అడిగింది యెలాగో కూడబలుక్కుంటూ.

"చచ్చారు సుస్మితా....మాట్లాడు సుస్మితా....ఎలా వుంది....?" ఆమెను కావలించుకుని యేడ్చేస్తున్నాడు సిద్ధార్థ.

"సైనిక బలగను....మీరు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అంతే చాలు....ఒంటెలు సిద్ధంగా వున్నాయి. ఏదో ఒక ఒంటెమీద క్షేమంగా ఎడారి దాటెయ్యండి. అందరూ వీళ్ళలాంటి దుష్టులే వుండరు....మీ కెవరో ఒకరు సాయం చెయ్యకపోరు....నేను....వెళ్ళిపోతున్నాను...."

"అంత మాటనకు సుస్మితా....రెండుసార్లు నా ప్రాణాల్ని కాపాడి నన్ను ఋణగ్రస్తుణ్ణి చేసి, నువ్వెళ్ళిపోతావా?....నే నీ భారం మోయలేను.........నన్ను క్షమించు....నీ పట్ల చాలా అమానుష్యంగా ప్రవర్తించాను...."

" ఎందుకలా మాట్లాడతారు? నేను ఎప్పట్నుంచో చెప్పాలనుకున్న మాట యిప్పుడు....ఈ చివరి క్షణాల్లో చెప్తున్నాను. నేను మిమ్మల్ని మనసారా ప్రేమించాను' ఆరాధించాను, మీ అర్ధాంగిని కావాలనుకున్నాను. కాని యెప్పుడూ నా మనసు....మీ....ముందుం....చలేదు.... అనుకో....కుండా ఈ ఎడా....రిలో... మీ దాన్నయ్యాను ... నా స్త్రీ జన్మ....సార్థక....మయింది. నా కంతకన్నా పెద్ద కోరిక లేదు....నన్నొక్కసారి కౌగలించు....కుని ముద్దు పెట్టుకోరూ!?...."

"సుస్మితా, సుస్మితా....ఐ లవ్ యూ....ఐ లవ్

యూ సుస్మితా...." ఆమెను అక్కున చేర్చుకుని ఆమె నుదుట పిచ్చిగా ముద్దులు పెడుతూ దుఃఖంతో వివశుడయి పోతూ అన్నాడు సిద్ధార్థ.

"చా....లు నా కెంతో....తృప్తిగా ..." ఆ తర్వాత ఆమె నోట మాట వెలువడలేదు.

ఒక్క క్షణం ఆమె ముఖంవైపు తేరిపార చూసి, బావురుమన్నాడు సిద్ధార్థ.

హృదయభారం తీరేవరకు అలా ఏడుస్తూనే వున్నాడు సిద్ధార్థ.

అతని చేతుల్లో చివరి ఊపిరి తీసుకున్న సుస్మిత ముఖంలో చెప్పలేని సంతృప్తి!

దాదాపు ఓ గంటవరకూ మామూలు స్థితికి రాలేక పోయాడు సిద్ధార్థ.

ఆ తర్వాత ఆమె శరీరంలో గుచ్చుకున్న కత్తిని బయటకు లాగేశాడు. ఆమె శరీరం క్రమంగా వేడిని కోల్పోయి కట్టెలా బిగుసుకుపోయింది.

అక్కడే మోకాళ్ళమీద కూచుని ఇసకని బాగా పెళ్ళగించి లోతుగా గొయ్యిని తయారుచేశాడు. ఆ గోతిలో సుస్మిత శరీరాన్ని వుంచి ఇసకతో కప్పేశాడు. ఆ పని చేస్తున్నంతసేపు అతని కళ్ళనుండి కన్నీరు అవిరళ ధారగా కారుతూనే వున్నది.

"నీ ప్రాణత్యాగంతో నా ప్రాణాన్ని నిలబెట్టి నన్ను కృతఘ్నుడిగా చేసేశావు సుస్మితా! నీకిదే నా శ్రద్ధాంజలి!" ఆమెను సమాధి చేసినంతవరకు అతను ఆమెను స్మరించుకుంటూనే వున్నాడు.

అప్పుడు సమయం తెల్లవారుఝామున నాలుగ్గంట లయ్యింది.

ఎదురుగా నాలుగు ఒంటెలు నిల్చునివున్నాయి యజమానుల ఆజ్ఞ కోసం.

సిద్ధార్థ వాటిలో ఓ ఒంటెను ఎన్నుకున్నాడు. ఓ కత్తిని వెంట వుంచుకున్నాడు. దాని మూపుమీదికి ఎగబ్రాకి యెక్కాడు.

జీవితంలో మొదటిసారిగా ఒంటెమీద ఆ ఎడారిలో ముందుకు ప్రయాణం సాగించాడు సిద్ధార్థ.

* * *

తెల్లవారింది.

ఎండ చురచుర పొడుచుకొచ్చింది.

సిద్ధార్థ ఒంటెమీద అలా ముందుకు సాగిపోతూనే వున్నాడు.

కనుచూపు మేరలో జనావాస ప్రాంతమేదీ అతనికి కనిపించలేదు.

ఓ పక్క సుస్మితను గురించిన ఆలోచనలు, ఆమె విషాదాంతం అతని గుండెను పట్టి నలిపివేస్తుంటే, మరోపక్క యెలాగైనా ఆ ఎడారి నుంచి బయటపడి యేదయినా సురక్షిత ప్రాంతం చేరుకోవాలని అతని మనసు ఆరాటపడుతోంది.

సూర్యుడు నడినెత్తిమీదికి కొచ్చాడు.

ఇసక కాలిపోయి వేడి ఆవిరి మొహానికి ఈడ్చికొడుతోంది. దాహం మొదలై దాని తీవ్రత అంతకంతకు పెరుగుతోంది.

మళ్ళీ నిన్నటి పరిస్థితి యెదురయ్యింది. గతరాత్రి ప్రాణం నిలుపుకోటానికి తిన్న పళ్ళవలన జరిగిన రాద్ధాంతం, ఆ తర్వాత సంభవించిన విపత్తు అతనికి గుర్తొస్తున్నాయి.

అకస్మాత్తుగా అతని కెక్కడినుంచో విమానం రొద వినిపించింది.

చెవులు రిక్కించి విన్నాడు సిద్ధార్థ.

అనుమానం లేదు. విమాన ప్రొపెల్లర్ శబ్దం స్పష్టంగా వినిపిస్తోందీసారి.

ఒక్కసారిగా అతనిలో నూతనోత్తేజం, ఆశ ఒకదానితో మరొకటి పోటీపడ్డాయి.

అది యే దేశానికి చెందిన విమానమైనా ఫరవాలేదు, తనని తప్పక రక్షిస్తారు.

ఆకాశంవయిపు కళ్ళు చిట్లించి చూశాడు సిద్ధార్థ.

విమానం చాలా యెత్తులో యెగురుతోంది. దాదాపు నాలుగు మైళ్ళ యెత్తులో నాలుగువందల నాట్స్‌కి తక్కువ కాని వేగంతో పయనిస్తోన్న ఆ విమానం తన ఉనికిని గుర్తిస్తుందనుకోవటం ఉత్త అత్యాశే అవుతుంది తప్ప, యేం ప్రయోజనముండదని గ్రహించి నిరాశపడ్డాడు సిద్ధార్థ.

చిన్న పక్షిలా కనిపించిన ఆ విమానం కొద్ది క్షణాల్లో కనుమరుగైపోయింది.

అవకాశం అందినట్టే అంది చేజారిపోవటం యెంత బాధాకరమయిన విషయమో అనుభవపూర్వకంగా తెలిసిందతనికి.

సమయం మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. ఎండ నిప్పులు చెరుగుతోంది.

సిద్ధార్థకి ఆకలి, దాహం కూడా అవుతున్నాయి. నిస్త్రాణ, నీరసం మేమూ ఉన్నామంటూ అతన్నాక్రమించాయి.

ఎటు చూసినా.... ఇసుక .... ఇసుక .... ఇసుక ... సహా

సముద్రంమీద ప్రయాణం చేసేవాడికి ఏ వైపు చూసినా నీరే కనిపించనట్టుగా ఆ యెడారిలో ఒంటరిగా ప్రయాణిస్తున్న సిద్ధారకి యెటు తలతిప్పి చూసినా ఎర్రగా కాలిపోతున్న ఇసక కనిపిస్తోంది. మధ్య మధ్య గాలి కెగిరి కళ్ళలో పడ్తోంది. ఎంత సేపని కళ్ళకి చేతులడ్డం పెట్టుకోగలడు?

• • •

చూస్తూండగానే చీకటి పడిపోయింది.

అంతవరకు వేడి గాడ్పులలో బీభత్సం సృష్టించిన వాతావరణం క్రమేపీ చల్లబడింది.

అనంతమైన ఎడారిలో సిద్ధార అలా సాగిపోతూనే వున్నాడు.

చీకటిపడుతూనే ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తూ ప్రత్యక్షమయ్యాయి.

ఒంటె యేమాత్రం అలుపు సొలుపు లేకుండా అలా ప్రయాణం చేస్తూనే వుంది ఎడారిలో. దానికి ఎడారి ఓడ అనే పేరెందుకొచ్చిందో అర్థమయ్యింది సిద్ధారకి.

ఆకలి, దాహం అతన్ని పట్టి పీడుస్తున్నాయి. ఉదయం నుంచి యెడతెరిపి లేకుండా అలాగే ఒంటె మీద కూచుని ప్రయాణం చేస్తూండటంవల్ల అతని నడుములు నొప్పి పుడుతున్నాయి. ఎక్కడయినా విశ్రమించా అని వున్నా, అతను ఆగదలచుకోలేదు.

మరో అరగంట ప్రయాణం సాగింది.

నక్షత్రాల వెలుగులో దూరంగా ఇసక లేగటం గమనించాడు సిద్ధార.

మళ్ళీ యేమైనా ఒంటెలు అటు వస్తున్నాయా?

ఒకే ఒక జంతువు దుమ్ము రేపుతూ ఆటే పరుగెత్తు కొస్తోంది.

పరీక్షగా చూసి త్రుళ్ళిపడ్డాడు సిద్ధార్థ. అతని చేయి పట్టాక తిమీద బిగుసుకుంది.

ఆ జంతువు ఒంటె కాదు. ఏదో...!? తనెప్పుడూ అలాంటి మృగాన్ని చూడలేదు.

చాలా భయంకరమైన జంతువది! ఎత్తుగా పొడవుగా సింహం ఆకారంలో వుంది. నోటినుంచి ఒకే ఒక దంతం చాలా సూదిగా బయటకు పొడుచుకు వచ్చి చూపరుల గుండెను దడపుట్టించేలా వుంది.

దాని కళ్ళు అగ్నిగోళాల్లా మెరుస్తోన్నాయి. దాని ఒంటినిండా దట్టమైన బొచ్చు అలరించుకుని వుంది, ఎలుగుబంటి శరీరం మీద బొచ్చులా. దాని నోటి చివరల నుంచి నురగ చొంగలా కార్తోంది.

దానికి తోక లేదు. కాళ్ళు నాలుగు బలంగా నేల మీద తేలిపోతున్నట్టుగా చెంగున గెంతుతూ వస్తోంది. దాని కాళ్ళు ఇసకలో యెందుకు కూరుచుకుపోవటంలేదో అతని కర్థంకాలేదు.

అది క్రూరజంతువని చూడగానే తెలిసిపోతోంది. అది మాంసాహారో, శాఖాహారో అతనికి తెలియదు. దానివల్ల తన కేదయినా హాని కలగవచ్చునని మాత్రం అతని సిక్త్స్ సెన్స్ హెచ్చరిస్తోంది.

ఏమో, అది మనిషి మాంసం రుచి కలవాటు పడిన క్రూరజంతువేమో, యెవరు చెప్పగలరు?

సృష్టిలోని ప్రతి ప్రాణి ఆహారం కోసం మరో ప్రాణిపై ఆధారపడి బ్రతుకుతోంది. అది తనకి హాని

చిక్కని పద్మంలో తనవైపే యెందుకలా పరుగెత్తుకొస్తోంది!?

ఒంటె ఆ మృగాన్ని చూస్తూనే వింతగా శబ్దం చేసింది.... ముందు కాళ్ళమీద గాల్లోకి లేచింది.

అనుకోని ఈ చర్యకు సిద్ధార్థ నేలమీదకు జారిపడి పోయుండేవాడే! కాని, ఒంటె యెప్పుడయితే ముందు కాళ్ళను లేపిందో, దాని మెడను గట్టిగా కావలించుకుని దాని మూపుపై పడుకున్నట్టు ముందుకు వాలాడు.

ఆ జంతువు అల్లంత దూరం నుంచే ముందు కాళ్ళను నేలమీద తాటించి గాల్లోకి యెగిరింది.

దగ్గర్నుంచి స్పష్టంగా చూశాడు సిద్ధార్థ దాని ఆకారం!

సింహానికి రెండు రెట్లు పొడవుగా, మూడు రెట్లు యెత్తుగా చిన్న సైజు ఏనుగు పరిమాణంలో వుందా జంతువు. అంత బరువైన జంతువు కూడా సునాయాసంగా గాల్లోకి యెగరటం అతడికి చాలా విస్మయాన్ని, గగుర్పాటును కలిగించింది.

ఆ జంతువు గాల్లోకి యెగుర్తూనే ఒంటె కంఠాన్ని పట్టుకొని తన వాడి దంతాన్ని సూటిగా దాని గొంతులో గుచ్చేసింది.

ఒంటె అమాంతం నేల కూలిపోయింది.

దాంతోబాటు సిద్ధార్థ కూడా నేలమీద పడి పోయాడు. అయితే ఇసకలో పడిపోతూనే స్ప్రింగులా పైకి లేచాడు.

ఒంటెను తీవ్రంగా గాయపరచిన ఆ దంతమృగం సిద్ధార్థను యేం లెక్కచేయని దానిలా ఒంటె రక్తాన్ని జుర్రుకుంటోంది,

ఒంటె గిల గిల తన్నుకుంటూనే వుందింకా. దాని ప్రాణలింకా శరీరాన్ని వదలేక పోతున్నాయి.

అంతవరకు తనకు వాహనంగా వుండి తననా ఎడారిలో మోసుకొంటూ వచ్చిన ఒంటెను ఆ దంత మృగం చంపటం, దారుణంగా దాని రక్తాన్ని ఆనందంగా జుర్రుకోవటం చూసిన సిద్ధార్థ పట్టాకత్తితో దాని నడుమ్మీద బలంగా మోదాడు.

అయితే ఖంగున శబ్దమయ్యిందే గాని దంత మృగం శరీరం ముక్కలు కాలేదు. ఆ దెబ్బకు సరిగ్గా రెండు ఖండాలుగా చీలిపోవలసిన దాని శరీరం చెక్కుచెదరకుండా వుండటం, కత్తి బండబారిపోయి వంగిపోవడం చూసిన సిద్ధార్థకి దిగ్భ్రాంతితో ఓ క్షణం మతిపోయింది.

దంతమృగం సామాన్యమైన జంతువు కాదని అతని కర్థమైపోయింది.

దెబ్బతిన్న దంతమృగం పెడబొబ్బ పెడుతూ సిద్ధార్థ మీదకి లంఘించింది.

సిద్ధార్థ ఎలర్ట్‌గా దాని దాడినుంచి తప్పించుకుని పక్కకు గెంతివుండకపోతే అది అతడి కంఠాన్ని వొడిసి పట్టుకుని దంతాన్ని అతని గొంతులో బలంగా దింపేసి వుండేది! సిద్ధార్థ రెండు చేతుల్తోను కత్తిని పట్టుకుని మరోసారి దంతమృగంమీద ప్రయోగించాడు.

ఆ దెబ్బ నుంచి వెంట్రుకవాసిలో తప్పించుకున్న ఆ మృగం ఈసారి గుర్రుపెట్టింది.

దాని ముందరి కాళ్ళు వెనుక కాళ్ళకన్నా పొడవుగా వుండటం అప్పుడు గుర్తించాడు సిద్ధార్థ. కాళ్ళ అడుగున బల్లపరుపుగా, ఇసకలో పరుగెత్తటాని కనువుగా దట్టమైన చర్మముంది. ఆ చర్మం పక్కల నుంచి వాడిగోళ్ళు

మెలితిరిగి చురకత్తుల్లా వున్నాయి.

ఒంటె నా జంతువు యెలా వొడిసిపట్టుకోగలిగిందో అర్థమయ్యిందతడికి. ఆకలి, దాహం, నీరసం, నిస్సత్తువ అన్నీ ఆ క్షణంలో మరచిపోయాడు. తన ప్రత్యర్థి దాడి నుంచి తప్పించుకుని ఎదురుదెబ్బ తీయటానికి వజ్ర సంకల్పంతో వున్నాడు.

దంతమృగం మరోసారి గాల్లోకి లేవటం, సిద్దార్థ మీదికి ఛార్జి చేయటం అదే క్షణంలో సిద్దార్థ దాని కళ్ళల్లోకి కత్తిని బలంగా దించెయ్యటం ఒకేసారి జరిగిపోయింది.

ఈసారి సిద్దార్థ దెబ్బ ఊరికినే పోలేదు. దాని కన్ను నుంచి రక్తం ధారలు కట్టింది. దంత మృగం గుండె లవిసేలా ఘీంకరించింది. దాని అరుపుకు సిద్దార్థ వళ్ళు జలదరించింది.

సిద్దార్థ ఊహించని విధంగా వొక్కసారిగా దంత మృగం వెనుతిరిగి వాయువేగంతో పారిపోయి క్షణాల్లో కనుమరుగైపోయింది.

సిద్దార్థ బలంగా ఊపిరి పీల్చి వదిలాడు.

ఆ దంత మృగం ముందు తానెంత? అది కన్ను పోగొట్టుకున్న కంగారులో మతి చెడినట్టు పారిపోయి వుండకపోతే యీ పాటికి దానికి ఆహారమైపోయుండేవాడు.

సిద్దార్థ ఒంటెవంక దీనంగా చూశాడు.

అప్పటికే అది ఆఖరిశ్వాస వదిలేసింది. దంత మృగం దాని గొంతు మీద చేసిన గాయం భయంకరంగా కనిపిస్తోంది.

అంటే, ఆ మృగం మాంసంకన్న రక్తాన్నే ఆహారంగా పీల్చుతుంటుందన్న మాట. ఇదెక్కడి రక్తపిపాసి? బహుశా దానిక్కూడా ఈ ఎడారిలో నీరు దొరక్క – రక్తాన్ని తాగి దాహం దీర్చుకుంటున్న దేమో....!?

అతడు కొద్దిక్షణాలు అలాగే ఇసకలో మోకాళ్ళమీద కూచుండిపోయాడు. అప్పటి అతని భంగిమ తన ఆప్త మిత్రుడి మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు వుంది.

* * *

చేతివాచీ చూసుకున్నాడు.

రాత్రి పదిగంటలు చూపిస్తోంది.

లేచి నిల్చున్నాడు సిద్ధార్థ. దంతవ్యాఘ్రంతో పోరాడుతూ తాత్కాలికంగా మరచిపోయిన ఆకలిదప్పులు తిరిగి అతన్నాశ్రయించాయి.

ఇప్పుడేం చెయ్యాలి? యెక్కడికి పోవాలి? ఇంతవరకు ఆ ఒంటె పుణ్యమా అని ఎంతో కొంతదూరం ప్రయాణించగలిగాడు. ఏదోక గమ్యం చేరగలననే ధైర్యంతో వున్నాడు.

ఇప్పుడా ఒంటె చనిపోయింది. తన గమ్యం అగమ్యంగా మారింది. ముందుకి పోగల శక్తి సన్నగిల్లింది. దాహంతో నిస్త్రాణగా వుంది. శరీరం తనతో సహకరించటం లేదు.

అయినా సరే, తను విశ్రమించకూడదు. ఈ ఎడారి నుంచి బయటపడటానికి, లేదా జనవాస ప్రాంతం వెతుక్కోటానికి ప్రాణం పోయేంతవరకు మానవ ప్రయత్నం చెయ్యాలి!

దృఢసంకల్పంతో ముందు కడుగు వేశాడు. కుడిచేత కత్తిని ధరించి, నలువైపులా పరీక్షగా చూస్తూ కాషన్‌గా

నడుస్తున్నాడు.

చెప్పతిని పారిపోయిన దంతమృగం యేవోక మూల నుంచి తనమీద దాడి చేసితీరుంది. దాని వేగం, దాని వేటాడే తీరూ, దాని క్రూరత్వం మరవలేకపోతున్నాడు. ఎందుకో బెదిరి పారిపోయింది గాని, దాని ధాటికి తను నిలబడగలడా?

సిద్ధాంకి యెక్కడి నుంచో కమ్మటి అరమగ్గిన పళ్ళ వాసన నాసికాపుటాలకి సోకింది. బాగా తెలిసిన సువాసన.

ఒక్కక్షణం ఆగి చుట్టూ పరికించి చూశాడు. తనకి యెడమవైపుగా రెండు చెట్లు కనిపించాయి.

వాటిని చూడగానే అతడికి చటుక్కున స్ఫురించింది ఆ చెట్లేమిటో....!

అవి ఖర్జూరపు చెట్లు. అవి ఖర్జూరపు పళ్ళ సువాసన....

ప్రాణం లేచివచ్చినట్టనిపించింది. ఒక్క అంగలో ఆ చెట్లను చేరుకున్నాడు. చేతికి అందేటంత యెత్తులో వున్నాయి ఖర్జూర గుత్తులు.

వాటి నందుకున్నాడు. కడుపు నిండింది. ఆకలి కూడా కొంత ఉపశమించినట్టే అనిపించింది.

కడుపు నిండగానే సహజంగానే అలసి సొలసిన శరీరం, మనసు విశ్రాంతి కోరాయి.

అక్కడే ఖర్జూర చెట్టకింద కూలబడ్డాడు. అప్పటికే బాగా చల్లబడిన గాలి అతన్ని సేదతీర్చింది.

అ స్వస్థంగా అలాగే ఇసకలో ఒరిగిపోయాడు. కొద్ది క్షణాల్లోనే వొళ్ళెరుగకుండా గాఢంగా నిద్రపట్టేసింది.

● ● ●

సూర్యకిరణాలు సూటిగా ముఖాన సూదుల్లా గుచ్చు కోవటంతో ఉలిక్కిపడి లేచి చూచున్నాడు సిద్ధార్థ.

వాచీలో టైమ్ ఏడుగంటలు చూపిస్తోంది.

సిద్ధార్థ ఆదరాబాదరా లేచాడు. పక్కనే పట్టాకత్తి సిద్ధంగా వుంది. దాన్నందుకున్నాడు.

ఓసారి పరిసరాలు పరికించి చూశాడు. ఎక్కడా అలికిడి లేదు—భయంకరమైన ప్రశాంతత.

ఉండి ఉండి గాలి విపరీతంగా వీస్తోంది. ఇసక పైకి లేస్తోంది. జాడలు జాడలుగా రేగిన ఇసక చిత్రకారుడి అద్భుత చిత్రంలాగా, డిజైన్సులాగా కనిపిస్తోంది. అవన్నీ ఆనందించే స్థితిలో లేడు అతడు.

అప్పటికే మూడురోజులుగా స్నానంలేక తన శరీరం మీద తనకే రోత పుడుతోంది—గుడ్డలు అట్టకట్టుకు పోయి తోలు ముక్కల్లా శరీరాని కతుక్కుని పోయాయి.

తాత్కాలికంగా ఉపశమించిన దాహం మళ్ళీ నేనున్నానంటూ ప్రత్యక్షమయ్యింది.

అక్కడ్నుంచి కదిలే ముందు మరికొన్ని ఖర్జూరప్పళ్ళు కోసుకుతిని ముందుకు సాగాడు.

దాదాపు ఓ గంట నడిచినా పూర్తిగా ఓ మైలు కూడా నడవలేకపోయాడు. అలాగే నాలుగైదు గంటలు పట్టుదలగా నడిచాడు. ఆ ఇసుకలో.

అతనికి దూరంగా ఇసక రేగుతున్న దృశ్యం కనిపించింది. ఆ తర్వాత రెండు ఒంటెలు పక్క పక్కనే నడుస్తూ రావటం కనపడ్డది. రెండు ఒంటెలమీదా ఇద్దరు వ్యక్తులున్నారు.

సిద్ధార్థకి ఆనందంతో నాట్యం చెయ్యాలనిపించింది.

ఫరవాలేదు. నిర్మానుష్యంగా వున్న ఎడారిలో మానవ మాత్రుడు కనిపించాడు. తనకేదోక దారి చూపించక పోరు!

'భగవాన్, నువ్వెంత దయామయుడివి!' అని మనసు లోనే దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ఒంటెలు సమీపించాయి.

వాటిమీద కూచున్న యిద్దర్నీ తనెప్పుడో ఎక్కడో చూసినట్లనిపించిం దతనికి.

ఎక్కడ చూశాడు? ఎప్పుడు?

గుర్తొచ్చీ రానట్టుంది.

ఒంటెలు ఆగాయి. వాళ్ళేదో ప్రశ్నిస్తున్నారు. కాని ఆ భాష సిద్ధార్థకి అర్థం కాలేదు గాని, అలాంటి మనుషుల్ని యెక్కడ చూశాడో వెంటనే గుర్తొచ్చింది....

వాళ్ళు చాలా కర్కశంగా, మొరటుగా నరరూప రాక్షసుల్లా వున్నారు వాళ్ళ భాష హిందీలా ధ్వనించిందే కాని హిందీ కాదు.

ఇలాంటి జాతి మనుషులే తనని, సుస్మితని, సాయం చేస్తామని ఒంటెలో యెక్కించుకుని వెన్నుపోటు పొడిచినది.

వాళ్ళు సిద్ధార్థ ఏమీ మాట్లాడక పోవటంతో మళ్ళీ ప్రశ్న రెట్టించారు.

విమానంలోంచి పడిపోయానని హిందీలో చెపుతూ అభినయించి చూపాడు అతడు.

వాళ్ళ కర్థమయింది.

మంచినీళ్ళు కావాలని అడిగాడు.

అందులో ఒకడు సారకాయలాంటి సాధనంలో

దాచుకున్న నీటిని పైకి తీశాడు పొడవాటి సంచీలో నుంచి.

సిద్ధార్థకి ప్రాణం లేచివచ్చింది. వాళ్ళు దుర్మార్గులు కాదు. రూపంలో వాళ్ళలా వున్నా ఆ నరరూప రాక్షసుల్లాంటివాళ్ళు కాదు.

చేతిలో వున్న కత్తిని ఇసకలో గుచ్చి రెండు చేతులు దగ్గరకు చేర్చుకుని నోటి దగ్గర దొప్పలా పట్టుకున్నాడు.

సరిగ్గా అప్పుడు పడింది రెండోవాడి దృష్టి ఆ పట్టా కత్తిమీద. కత్తి మొనకి దంతమృగం రక్తం అంటి నల్లగా మారింది.

"ఈ కత్తి నీ కెక్కడిది?" అని గద్దించి అడిగాడు ఆ వ్యక్తి.

గతుక్కుమన్నాడు సిద్ధార్థ. నీరు వంచబోతున్న వ్యక్తి చటుక్కున ఆగిపోయి తనూ ఆ కత్తి వంక చూశాడు.

ఏం చెప్పాలో వెంటనే స్ఫురించలేదు సిద్ధార్థకి. అయితే అతనూహించని విధంగా అందులో ఓ వ్యక్తి తన దగ్గరున్న అలాంటి పట్టాకత్తిని వేగంగా అతని మీదికి విసిరాడు.

సిద్ధార్థ మెరుపువేగంతో లాఘవంగా ఆ కత్తి వేటు నించి తప్పించుకుని ఇసకలో గుచ్చిన కత్తినందుకున్నాడు.

రెండోవ్యక్తి చేతిలో మరో కత్తివుంది. అతనుదాన్ని చేత ధరించి సిద్ధార్థ మీది కురికాడు ఒంటెమీదినుంచి.

సిద్ధార్థ అతని ప్రయత్నాన్ని కూడా వమ్ము చేశాడు. తన చేతిలోని కత్తితో అతని కత్తిని బలంగా కొట్టాడు.

అది ఎగిరి అంత దూరంలో పడింది.

ఈ లోపల మొదటి వ్యక్తి కూడా ఒంటెమీదినుంచి నేలమీద దూకాడు.

సిద్ధార్థ రెండో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచాడు కత్తితో.

రెండో వ్యక్తి నేలకూలిపోతూ సిద్ధార్థ గుండెలమీద బలంగా తన్నాడు.

సిద్ధార్థ చేతిలోని కత్తి ఎగిరి అవతలపడింది. అతను వెల్లకిలా ఇసకలో పడిపోయాడు.

అదే అదనుగా మొదటివ్యక్తి కిందపడిపోయిన తన కత్తినందుకుని సిద్ధార్థ మీదికి వేగంగా విసిరాడు.

అది సిద్ధార్థ భుజాన్ని గాయపరచి ఇసకలో కూరుకుపోయింది.

బాధతో అరిచాడు సిద్ధార్థ. భుజంనించి జలజల రక్తం ప్రవహిస్తోంది. తనని గాయపరచిన ఆ వ్యక్తి పొత్తికడుపుమీద డొక్కల్లోను బలంగా కాళ్ళతో తన్నాడు సిద్ధార్థ.

అతను లుంగ చుట్టుకుపోయి నేలమీద కూలబడ్డాడు. రెండు గుప్పిళ్ళతోను ఇసక తీసి అతని కళ్ళల్లో గుప్పించాడు సిద్ధార్థ. బాధతో కీచుగా అరిచాడతను.

ఈ లోపల రెండో వ్యక్తి సర్దుకుని లేచాడు. ఇసకలో కూరుకుపోయిన కత్తిని అందుకున్నాడు.

అతన్ని ప్రతిఘటించటానికి సిద్ధంగా లేడు సిద్ధార్థ. అప్పటికే తీవ్రమైన రక్తస్రావంతో అతని కళ్ళు చీకట్లు కమ్మి దృశ్యాలు మసగ్గా కనిపిస్తున్నాయి. రెప్పలు మూతబడి పోతున్నాయి.

తనపని అంతటితో అయిపోయిందనుకున్నాడు సిద్ధార్థ.

అయితే తనని చంపటానికి కాలరుద్రుడిలా మీదికొచ్చిన ఆ వ్యక్తి అమాంతం ఎందుకు వెనక్కు విరుచుకు పడిపోయాడో సిద్ధార్థ గ్రహించే లోపలే అతనికి స్పృహ తప్పిపోయింది.

* * *

అతనికి మెలకువ వచ్చేసరికి ఎండ తీవ్రస్థాయిలో వుంది. అయితే తను దట్టమైన ఓ చెట్టునీడలో ఓ స్త్రీ సాన్నిధ్యంలో వున్నాడు.

ముఖం మీద నీళ్ళు చిలకరిస్తూ తనని స్పృహలోకి తీసుకురావటానికి శత విధాల ప్రయత్నించి సఫలీకృతురాలైన ఆ అమ్మాయి సిద్ధార్థ ముఖంలోకి చల్లగా చూసి చిన్నగా నవ్వింది.

తను ఆమె ఒడిలో పడుకుని వున్నట్టు గ్రహించి చటుక్కున లేవబోయాడు సిద్ధార్థ. అయితే భుజందగ్గిర గాయం చురుక్కుమన్నది. నీరసం, నిస్సత్తువ అతన్ని నిర్వీర్యుణ్ని చేశాయి.

మంచినీళ్ళు కావాలని సైగ చేశాడు.

ఆమె సొరకాయ బుర్రలోనించి నీటిని అతని నోట్లో పోసింది. ఒక చుక్క కూడా మిగలకుండా నీరంతా తాగేశాడు. సిద్ధార్థ ఆమెవంక కృతజ్ఞతగా చూశాడు.

ఆమె మళ్ళీ చిన్నగా నవ్వింది తెల్లటి మంచి ముత్యాల్లాంటి పలువరస తళుక్కుమని మెరిసింది.

ఆమెవంక పరీక్షగా చూశాడు సిద్ధార్థ. ఆమె మరీ అనాగరికంగా లేదు. వక్షస్థలం చుట్టూ పూసలతో డిజైన్ చేసిన రవికె వేసుకున్నది. నడుం దగ్గిర్నుంచి కాళ్ళవరకు అలాంటి పూసలతో చుట్టుకున్న ఎర్రరంగు పరికిణీ వేసుకున్నది. మెడలో రకరకాల రంగుల్లో వున్న

పూసల పేరు వేసుకున్నది. రవికె నుంచి పరికిణీ వరకు నగ్నంగావున్న దేహం పాలరాయిలా తెల్లగా వుంది.

ఆమె జుట్టు ముడివేసుకోలేదు. ముంగురులు నుదుటి మీద అందంగా అల్లరిగా లాస్యం చేస్తున్నాయి. నుదుటి మీద బొట్టు మెరుస్తోంది. అది తిలకమో, మరే రకమైన కుంకుమో అతనికి తెలియలేదు.

మొత్తంమీద ఆమె అలంకరణ అతి సామాన్యంగానే వున్నా అత్యంతాకర్షణీయంగా, గౌరవ ప్రదంగానే వుంది.

ఆమెను చూడగానే సిద్ధార్థకు ముచ్చట వేసింది. ఆమె ఒళ్ళోనించి లేవాలని మరోసారి ప్రయత్నించాడు.

చిన్నగా వారిస్తూ "లేవకండి" అన్నదామె యాసతో కూడిన హిందీలో.

సిద్ధార్థ ఆశ్చర్యపోయి చూశాడు. అతనికి చాలా ఆనందమయ్యింది. ఫరవాలేదు. తన కర్థమయ్యే భాషలోనే మాట్లాడుతోందామె. ప్రాణం లేచివచ్చినట్టయ్యింది.

"వాళ్ళు.... వాళ్ళేమయ్యారు?" అనడిగాడు సిద్ధార్థ హిందీలో.

ఆమె దూరంగా వేలుపెట్టి చూపించింది.

నేలమీద బోర్లాపడున్న రెండు శవాలు కనిపించాయి అతనికి.

"వాళ్ళని నేనే చంపాను. లేకుంటే నిన్ను చంపేసి వుండేవాళ్ళు." అన్నదామె చాలా సర్వ సాధారణంగా.

"నీకు నా కృతజ్ఞతలు, నా ప్రాణం కాపాడావు." అన్నాడు సిద్ధార్థ.

ఆమె మందహాసం చేసింది. ఆమె అలా నవ్వుతున్న

పుడు చాలా మనోహరంగా, స్నిగ్ధంగా కనిపించిందతనికి.

భుజం తడుముకున్నాడు. ఏదో ఆకులపసరు పచ్చగా భుజం మీద కనిపించింది. ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.

ఆమెపట్ల అతని కృతజ్ఞత మరింతగా పెరిగింది. తన భుజానికి తగిలిన గాయానికి ప్రకృతి వైద్యమేదో చేసిందామె. లేకుంటే రక్తస్రావంతో తన ప్రాణాలు ఎప్పుడో పోయుండేవి.

అంటే. అటు ఆ దుండగులనించి, ఇటు గాయంనించీ కూడా ఆమె తనని కాపాడింది.

“ఈ ఎడారిలోకి ఎలా వచ్చి పడ్డావు? వాళ్ళతో నీకెందుకు తగవొచ్చింది?” అడిగిందామె.

క్లుప్తంగా జరిగింది చెప్పాడు సిద్ధార్థ.

సుస్మిత మరణం గురించి విన్న ఆ అమ్మాయి బాగా చలించిపోయింది. కన్నీరు ఆమె చెక్కిళ్ళమీదుగా జారింది. ఎంతైనా ఆమెది స్త్రీ హృదయం!

“నువ్వలా చెయ్యటంలో తప్పులేదు. ఈ ఘోర్కా జాతి మనుషులు చాలా దుర్మార్గులు. చిన్న చిన్న గ్రామాలమీద పడి దోచుకోవటమే వీళ్ళవృత్తి. వీళ్ళ గురించి తెలిసిన వాళ్ళెవరూ వీళ్ళతో విరోధం పెట్టుకోరు.” చెప్పిందామె.

“ఇంతకీ నువ్వెవరు? ఈ అనంతమైన ఎడారిలో నీ నివాసమెక్కడ? ఈ ఎడారి ఏ ప్రాంతానికి చెందినది? ఢిల్లీ ఇక్కడికెంత దూరంలో వుంది? ఇది భారతదేశ భూభాగానికి చెందిన ఎడారేనా?” ప్రశ్నలవర్షం కురిపించాడు.

ఆమె కిలకిల నవ్వింది.

"ఒక్కసారిగా ఇన్ని ప్రశ్నలు వేసేస్తే నేనెలా సమాధానం చెప్పగలను? ఇది భారతదేశానికి చెందిన ఎడారే. అంతకి మించిన వివరాలు నాకు తెలియదు. మా బాపూకి తెలుస్తుంది."

"బాపూ ఎవరు?"

"మా తండ్రి."

"ఓహో, నీ నివాసమెక్కడ?"

"ఇక్కడికి రెండు క్రోసుల దూరంలో వుంది."

"అక్కడ నీరుంటుందా?"

"నీటి చెలిమలుంటాయి. వాటి సాయంతో నే మేం కొన్ని పంటలు పండించుకుంటాం."

నీరుంటుందని తెలియగానే సిద్ధార్థకి చాలా ఆనందమై పోయింది. ముందు తృప్తిగా కడుపునిండా నీరుతాగాలి. ఇందాకా తాగిన నీరు అప్పుడే ఆవిరై పోయింది. మళ్ళీ దాహం వేస్తోంది. సమయానికి, ఆ చచ్చిన దుండగులు వెంట తెచ్చుకున్న నీటితో సేదతీరాడు.

ఏ వస్తువుకైనా విలువ అది దొరకనప్పుడే పెరుగుతుంది. తన జీవితంలో నీటిచుక్క కోసం పడరాని అగచాట్లు పడాల్సివస్తుందని సిద్ధార్థ ఎన్నడూ ఊహించలేదు.

ముందు ఆమె తండ్రిని కలుసుకోవాలి. అతని ద్వారా తను హైదరాబాదు తిరిగిపోయే దారి వెతుక్కోవాలి!

అతనికా సమయంలో తల్లి గుర్తొచ్చింది. తనింకా రాకపోవటానికి కారణం ఆమెకి తెలిసిపోయుంటుందా? తన కొడుకు శాశ్వతంగా దూరమైపోయాడని తెలిస్తే ఆ మాతృ హృదయం తట్టుకోగలదా?

దివ్య ఎలా వున్నదో? తన రాకకోసం వెయ్యికళ్ళతో

ఎదురుచూస్తుంటానని తను బయల్దేరిన రోజు మరీ మరీ చెప్పింది. ఈపాటికి నిజం ఆమెక్కూడా తెలిసిపోయుంటే....!?

ఆవేదనతో తల విదిలించాడు అతడు.

ఒక్కసారిగా ఆలోచనల్లోకి జారిపోయి తన ఉనికి నే విస్మరించిన అతనివైపు ఆశ్చర్యంగా చూసింది ఆ అమ్మాయి.

"ఏమిటి నువ్వేదో తీవ్రంగా ఆలోచిస్తూన్నట్టున్నావు....!?" అడిగింది.

"ఆఁ....అహా, ఏంలేదు....నీ పేరేమిటా అని—!?"

"నా పేరేమిటో ఆలోచిస్తే తెలుస్తుందా, నన్నడగాలి గాని!!"

"ఆఁ, అవును. నిన్నడగాలి. ఇంతకీ నీ పేరేమిటి?"

"కోయల్."

"కోయల్ అంటే!? ఓహో హిందీలో కోయల్ అంటే కోయిలకదూ!"

"కోయిలకాదు, నా పేరు కోయల్."

"అవును. మా తెలుగు భాషలో కోయిల అని పిలుస్తాం. నేను కూడా నిన్ను కోయిలా అనే పిలుస్తాను."

"అలాగే పిలువు, నా కభ్యంతరంలేదు" అన్నదామె, లేచి నిలబడుతూ.

"ఇక మా నివాసానికి వెళ్దాం. నన్ను ఆసరాగా పట్టుకో." అన్నది కోయిల.

నిద్దార మొహమాటంగా నవ్వి. "ఫరవాలేదు, నేను నడవగిలను." అన్నాడు.

కోయిల అంతదాకా ఓ. పక్కగావుంచిన విల్లమ్ములు

చేతి ధరించింది. అప్పుడు స్ఫురించింది సిద్ధార్థకి—ఆమె ఘోర్ కృజాతి బందిపోటుల్ని ఎలా సంహరించినదీ.

* * *

కడిభుజం గాయంలో నొప్పిగా వున్నందువల్ల ఎడమ చేత్తో కత్తిపట్టుకుని ఆమెతో బాటు ముందుకు సాగాడు సిద్ధార్థ.

"ఆకలి వేస్తోందా?" అడిగిందామె.

అతడికి నిజంగానే చాలా ఆకలిగావుంది. కాని ఆ విషయం ఆమెతో చెప్పటానికి బిడియపడ్డాడు.

అయినా ఆమె అతని ఇబ్బంది గ్రహించకపోలేదు.

"ఇంటికి వెళ్ళగానే వేడి వేడి జొన్న సంకటి ఇస్తాను. చాలా శక్తివస్తుంది. హుషారుగా వుంటావు." అన్నదామె.

జొన్నసంకటి పేరు వినగానే సిద్ధార్థ ఆకలి ఎటో పారిపోయింది. పాపం, అదే అక్కడి ఎడారి ప్రజ జీవనాధారం. వాళ్ళకి ముఖ్య ఆహారం. ప్రాణం నిలుపుకోవటానికి తనూ అదే తినాలి, తప్పదు!

వాళ్ళు దాదాపు ఓ మైలు దూరం నడిచారో లేదో ఇంతలోనే ఎదురుచూడని ఉపద్రవం సంభవించింది.

ఎప్పుడు ఎవగ్గావచ్చి నిలబడిందో తెలీదుగాని ముందరి కాళ్ళను నేలకి అనించి గాల్లోకి లేచింది—ఓ కన్ను లొట్టబోయిన దంతవ్యాఘ్రం. దాని టార్గెట్ సిద్ధార్థ.

అయితే ప్రమాదాన్ని ముందుగా గుర్తించినదకోయిలే. విల్లు సంధించటానికి ఏ మాత్రం వ్యవధిలేదు.

ఒక్క ఉదుటున అతనిని పక్కకి మెరుపు వేగంతో తోసేసింది కోయిల.

సిద్ధార్థ పిల్లిమొగ్గ వేసి అల్లంత దూరంలో పడటం,

దంతవ్యాఘ్రం గురితప్పి ఇసకలో పడిపోవటం ఒకేసారి జరిగాయి.

సిద్ధార్థ దిగ్భ్రమనించి తేరుకునే లోపల దంతవ్యాఘ్రం మళ్ళీ గాల్లోకి ఎగిరింది — అతని మీద ఛార్జి చెయ్యటానికి.

కోయిల చాలా ఎలర్టుగా పని చేసింది. సిద్ధార్థ చేతి నుంచి పట్టాకత్తి అందిపుచ్చుకుంది. దంతవ్యాఘ్రం వీపు పై భాగం యెంత కఠినశిలలా వుంటుందో దాని పొట్ట భాగం అంత సున్నితంగా వుంటుందని ఆమెకు తెలుసు.

సరిగ్గా వ్యాఘ్రం సిద్ధార్థమీద దూకే సమయానికి రెండు చేతుల్లోను కత్తిని ఫర్మ్‌గా పట్టుకొని గాల్లోకి నిటారుగా లేపింది!

అంతే! దంతవ్యాఘ్రం సరాసరి కత్తిమీద పడటం. దాని పొట్టలో దిగిన కత్తి నడుంమీద లోతుగా దిగబడి పోవటం, అది ప్రళయభీకరంగా గర్జించటం, నేల కూలటం ఏకకాలంలో జరిగాయి.

సిద్ధార్థ దిగ్భ్రాంతి నుంచి యింకా తేరుకోలేదు.

కోయిల అతన్ని లేవదీసి కూర్చోబెట్టింది.

"ఈ దంతవ్యాఘ్రం నావల్ల గాయపడి పారిపోయింది. పగపట్టి ఇంతలోనే నామీద దాడి చేసింది అకస్మాత్తుగా. మరోసారి నా ప్రాణం కాపాడిన నిన్నెలా అభినందించను? యేమిచ్చి రుణం తీర్చుకోను?" అన్నాడు సిద్ధార్థ ఆమెవంక కృతజ్ఞత మెరిసే కళ్ళతో చూస్తూ.

ఆమె తేలిగ్గా నవ్వేసింది.

"ఆపదలలో అనుక్షణం ఆదుకుంటూ, ప్రమాదలలో

ప్రతిక్షణం పెనవేసుకున్న బ్రతుకులు మావి. భయమన్నది మా దరిదాపులక్కూడా రాదు, రానివ్వం."

• • •

ఇద్దరు మళ్ళీ నడక సాగించారు.

పట్టాకత్తిని దంతమృగం శరీరం నుంచి లాగి, సిద్ధార్థ కండించింది.

అప్పటికి సూర్యుడు పూర్తిగా కుంగిపోయాడు చీకటి నలుదిశలా పరచుకుంటున్నది.

"ఏదయినా చిన్న జంతువును వేటాడి తీసుకురమ్మని పంపాడు బాపూ. నే నా విషయమే విస్మరించాను" అన్నది కోయిల.

"ఇక్కడ ఆహారానికి పనికొచ్చే జంతువులున్నాయా? నా కింతవరకు కనిపించనే లేదు."

"పగలంతా ఇసుక వేడిగా వుంటుంది. దాక్కోవటానికి సరయిన మరుగుప్రదేశం దొరకదు—అందుకని ఏ చెట్టు తొర్రలోనో పగలు గడిపి చీకటిపడ్డాక ఆహారం కోసం వెతుక్కుంటూ బయటకు వస్తాయి — ఇప్పుడే సరయిన అదను. కాని మనకి టైమ్ లేదు, పద!"

మరో అరగంట ప్రయాణం తర్వాత కొండవాలు ప్రాంతము దగ్గరకు చేరుకున్నారు.

దూరం నుంచే యెర్రగా మంటలు కనిపించాయి వాళ్ళకి.

కోయిల ఆ దృశ్యం చూస్తూనే చిన్నగా అరిచింది. "ఏదో జరక్కూడనిది జరిగిపోయింది. నాతో బాటు పరుగెత్తు!...." అంటూ లేడిలా దూసుకుపోయింది కోయిల.

సరిగ్గా పది నిమిషాల్లో ఆ స్పాట్ కు చేరుకున్నా

రిద్దరు.

అప్పటికే అక్కడి ఇళ్ళన్నీ పరశురామ ప్రీతి అయి పోయాయి.

దూరంగా ఒంటెలమీద సాగిపోతున్న ఆకారాలు గుర్తించిన కోయిల ముఖం జేవురించింది.

"ఘోర్ క్షజాతి బందిపోట్లు. వీళ్ళ అంతు చూస్తాను" అంటూ బాణం వింటికి సంధించి ఆకర్ణాంతం లాగి వదిలింది కోయిల.

ఒకడు నేలకూలిపోయాడు.

ఆ తర్వాత మరో బాణం, యింకో బాణం....అలా అలా బందిపోట్లు నేలకూలేవరకు బాణాలు గుప్పిస్తూనే వుంది....ఆమె గురి ఒక్క సారి కూడా వ్యర్థం కాలేదు.

మొత్తం ఎనిమిదిమంది బందిపోట్లు! అందరూ ఒంటెల మీదినుంచి ఇసుకలో దొరిగిపోయారు.

అప్పటికిగాని శాంతించలేదు కోయిల.

అయితే మరో హృదయవిదారకమైన సంఘటన అంతక్రితమే జరిగిపోయిందని ఆమెకు తెలియదు.

ఓ పక్క కాలిపోతున్న కొంపల్ని రక్షించుకోవాలనే ప్రయత్నం చేస్తున్న వ్యక్తుల్లో కొందరు కోయిలని చుట్టుముట్టారు.

వాళ్ళు చెప్పిన వార్త వినగానే ఆమె చేతిలోని విల్లమ్ములు అప్రయత్నంగా జారి పడిపోయాయి.

"బాపూ!" అంటూ బిగ్గరగా అరిచింది.

కాని అప్పటికే కోయిల తండ్రి శరీరం మంటల్లో పూర్తిగా కాలి బూడిదై పోయింది. ఆకన్ని రక్షించాలని మంటల్లో దూకిన మరో యిద్దరు కూడా ఆహుతులయి పోయారు.

తండ్రి చితాభస్మం పట్టుకొని ఘోరంగా శపథం చేసింది కోయిల. ఘోరక్జాతి నంతా సమూలంగా నాశనం చేసి తండ్రి ఆత్మకు శాంతి చేకూరుస్తానని. అంత వరకు తను విశ్రమించనని ఒట్టు పెట్టుకుంది.

ఆ క్షణంలో ఆమె అపరకాళిలా వుంది. ఆమె కళ్ళ నుంచి నిప్పులు రాలుతున్నాయన్నట్టు ముఖమంతా ఎర్రగా పోయింది. నిలువెల్లా ఆవేశాగ్రహాలతో వొణికి కందిపోయింది.

ఆమెనా స్థితిలో చూసిన ఎంతటి ధీరుడైనా రవంత చలించక పోడు భయంతో.

సిద్దార్థ పరిసరాలను పరిశీలించి చూశాడు.

గడ్డితోను పెట్టుకొమ్మలతోను నిర్మించుకున్న పూరిళ్ళు అవి దాదాపు ఏభై వున్నాయి. ఒక్కటి కూడా మిగలకుండా దగ్ధమైపోయాయి.

ఘోరక్జాతి బందిపోట్లు ఆ గూడెంవాసులు సంవత్సరమంతా కష్టపడి పండించుకున్న తిండి గింజల్ని సమూలంగా దోచుకున్నారు. వాటిని గోతాముల్లోకి ఎక్కించి ఒంటెల మూపుమీద వేసుకుని అడ్డొచ్చిన వాళ్ళనందర్నీ ఊచకోతగా నరికేసి వాళ్ళను భయభ్రాంతుల్ని చేశారు....

అంతటితో పోయినా బావుండేది. కత్తిదూసి తమ మీదికురికిన కోయిల పినతండ్రిని అమానుషంగా శరీర భాగాల్ని ఖండ ఖండాలుగా నరికేశారు.

అది చూసి ఆవేశపరుడయిన కోయిల తండ్రి మెరికలాంటి యువకులతో బందిపోట్ల నెదుర్కోవటానికొచ్చాడు. పరిస్థితి విషమిస్తున్నదని గ్రహించిన బందిపోట్లు వాళ్ళ కొంపలికి నిప్పు పెట్టేశారు.

అంతే, ఒక్కసారిగా హాహాకారాలు మిన్నుముట్టాయి. ఎవరికివారే తమ భార్యాబిడ్డల్ని రక్షించుకునే తాపత్రయంలో పడి బందిపోట్ల సంగతి పట్టించుకోలేరు.

కోయిల తండ్రి మంటల్లో చిక్కుకున్న ఇద్దరు పసి పాపల్ని రక్షించటానికి కాలిపోతున్న ఇంట్లోకి దూసుకు పోయాడు. ఆ ఇద్దర్నీ రక్షించి బయటకు చేర్చాడు.

అయితే ఓ ముసలామె నిస్సహాయస్థితిలో అదే ఇంట్లో మంచంలో పడుండగా చూసి, మళ్ళీ ఎందరో వద్దని వారిస్తున్నా వినక లోపలికి వెళ్ళి బయటికి రాలేక పోయాడు. అతన్ని రక్షించాలని ఇద్దరు యువకులు ఆ ఇంట్లోకి దుస్సాహసంతో ప్రవేశించి కోయిల తండ్రితో పాటు మంటల్లో కాలిపోయారు.

తర్వాత లెక్క చూసుకోగా గూడెం వాసుల్లో సగానికి పైగానే అగ్నికి ఆహుతైపోయినట్టు తెలిసింది. కోయిల ఆఖరి క్షణాల్లో అక్కడికొచ్చింది.

తనవాళ్ళవైపు చూసి, "వాళ్ళు ఎత్తుకుపోబోయిన గోతాముల్ని వెనక్కి తెచ్చుకోండి" అన్నది కోయిల గంభీరంగా.

తమ నాయకుడి కుమార్తె మాట వాళ్ళకు శిలాక్షరం! మరుక్షణం ఎనిమిది ఒంటెల్ని వాటి మీది సామానుతో వెనక్కి తీసుకొచ్చారు గూడెంవాసులు.

తర్వాత ఆమె తన మనుషులవంక సూటిగా చూసి, "మన కింతటి అన్యాయం చేసిన ఆ ఘోర్క జాతిని తుద ముట్టిద్దాం. మీలో ధైర్యవంతులుంటే నాతో రండి." అన్నది.

ఎవరూ కిక్కురుమనలేదు. ముందుకు రాలేదు.

కోయిల హతాశురాలయ్యింది.

"మీలో పౌరుషమున్న మొగాడే లేడా!? మన కష్టార్జితాన్ని ఇన్నాళ్ళు పందికొక్కుల్లా పడి తింటూ ఈ రోజు మన ప్రాణాల్ని, సరుకుల్ని హరించిన ఆ బంధి పోట్లమీద ప్రతీకారం తీర్చుకోవాలని లేదా? అవమానం, తీరని అవమానం!" అన్నది హుంకరిస్తూ.

ఓ నడివయసు మనిషి ముందుకొచ్చి, "అమ్మా, వాళ్ళు బలంలోను సంఖ్యలోను మనకన్న పదిరెట్లున్నారు. వాళ్ళనెదిరించి బతికి బట్టకట్టలేం. మన మేకాదు, ఈ ఎడారిలోని ఇరవై ఎనిమిది గూడేల వాసులు ఆ బంది పోట్ల ఆగడాలకి బలై పోతున్న వాళ్ళే. అయితే ఎవరూ కిమ్మనకుండా వాళ్ళక్కావలసింది ఇచ్చి పంపటమే గాని వాళ్ళతో విరోధం పెట్టుకోరు..." అని ఇంకా ఏదో చెప్తుండగానే కోయిల మహోగ్రంగా అరిచింది.

"నోర్ముయ్యి. వాళ్ళకి బానిసలుగా, తొత్తులుగా బతికి నిలుపుకునే ప్రాణాలు తుచ్ఛమైనవి. మన గూడే లన్నీ ఏకతాటిమీద నిలిచి ఎదిరిస్తే ఏనాడో ఆ బంది పోట్లు సర్వనాశనమై పోయుండేవారు. మీలో చేవ చచ్చింది. పౌరుషం అడుగంటింది. ఆడాళ్ళ దగ్గర చూపించటానికి తప్ప మీ ప్రతాపాలు మరెందుకూ పనికి రావు.

సరే, వినండి... నేనొక్కతెనూ చాలు, ఆ జాతిని సమూలంగా నాశనం చెయ్యటానికి! నా శక్తియుక్తులతో ఆ జాతి సంతతినీ రూపుమాపి గాని తిరిగి ఈ గూడెంలో అడుగుపెట్టను. ఇప్పుడే బయల్దేరి వెళ్తున్నాను." అన్నది కోయిల గంభీర స్వరంతో.

అప్పటికీ వాళ్లెవరూ పౌరుషం తెచ్చుకుని ఆమెకు బాసటగా నిలవటానికి ముందుకు రాలేదు.

అయితే ఇదంతా చూస్తున్న సిద్ధార్థకి కోయిల కృత నిశ్చయం. పట్టుదల. ఆమె వ్యక్తిత్వం బాగా నచ్చాయి. ఒక ఆడపిల్ల అంత ధైర్యంగా శత్రువుల నెదిరించి పోరాడటానికి బయల్దేరుతుంటే తమకేమీ పట్టనట్టు స్వార్థంతో వ్యవహరిస్తున్న ఆ గూడెం వాసులమీద అసహ్యం కలిగింది.

ఆ ఘోర్కా జాతి బందిపోట్లు తనకీ శత్రువులే! అమాయకురాలైన, తనని నిష్కల్మషంగా ఆరాధించి ప్రేమించిన సుస్మితని దారుణంగా చంపిన కిరాతక జాతి అది! ఆమెని చంపినవాళ్లనైతే తను చంపగలిగాడు గాని, ఆ జాతినే సమూలంగా తుద ముట్టించటానికి తిరుగులేని నిర్ణయం తీసుకున్నది కోయిల.

ఎవరు ఆమె వెంట వెళ్ళినా వెళ్ళకున్నా తనుంటాడు ఆమె వెన్నంటి.

"పద కోయిలా, నేనున్నాను. నీ ప్రతిజ్ఞ నెరవేరటానికి నాకు చేతనైన సాయం నేనూ చేస్తాను." అన్నాడు సిద్ధార్థ ఎడమచేత్తో కత్తి నెత్తి ప్రమాణం చేస్తూన్నట్టు పట్టుకొని.

కోయిల కళ్ళు విప్పార్చి ఆనందాశ్చర్యాలతో సంబరంగా చూసిం దతని వంక.

"ఆవేశంతో తీసుకున్న నిర్ణయం తాటాకు మంట లాంటిది. నువ్వు మా అతిథివి. నేను తిరిగొచ్చే వరకు మా ఆతిథ్యం స్వీకరిస్తూ ఇక్కడే వుండు. నేను బతికి తిరిగొస్తే నిన్ను సురక్షితంగా మీ దేశం పంపిస్తాను," అన్నది కోయిల గంభీరంగా.

"నాది ఆవేశంతో తీసుకున్న నిర్ణయంకాదు. పవిత్రాశయానికి ప్రభావితుడినై నీతో వస్తూన్నాను. ఆ ప్రయ

త్నంలో నువ్వు దక్కించిన ఈ ప్రాణం పోయినా లెక్క చెయ్యను.”

కోయిల కళ్ళ వెంట ఆనందబాష్పాలు రాలాయి.

“సెహభాష్. నా వాళ్లనుకున్న నా గూడెం మనుషులు స్వార్థంతో వెనుకంజ వేస్తే ధైర్యంగా ముందుకొచ్చావు. పద...” అంటూ అంతలోనే ఏదో గుర్తొచ్చి ఆగింది.

ప్రశ్నార్థకంగా చూశాడు సిద్ధార్థ.

“నువ్వు ఆహారమేదీ తీసుకోలేదు. మంచినీరు కూడా అడిగావు..!?” అన్నది.

“ఇప్పుడేమీ వద్దు ఓ పక్క తండ్రిని పోగొట్టుకొని ఎంతో మనోక్లేశాన్ని అనుభవిస్తూన్నావు. నా తిండి కోసం ఏమీ ప్రయత్నాలు చెయ్యవద్దు, పద.” అన్నాడు అతడు.

నిజంగానే అతనికి ఆ వాతావరణంలో ఏమీ తినాలని లేదు. ఎటు చూసినా విషాదం తాండవిస్తోందక్కడ.

అప్పటికప్పుడు బయల్దేరింది కోయిల. మరిన్ని బాణాలు తీసుకుని వీపుకి అంబులపొద కట్టుకొని అందులో అమర్చుకొంది. మరో విల్లు, బాణాలు అతడికిచ్చింది.

రెండు ఆరోగ్యంగా చలాకీగావున్న ఒంటెల్ని ఎన్నుకొంది. ఓ ఒంటెమీదికి యెగిరికూచుంది. మరో ఒంటె నధిరోహించాడు సిద్ధార్థ.

మరు నిమిషము ఒంటెలు రెండూ ఆ రాత్రి సమయాన ఎడారిలో వేగంగా ముందుకు సాగిపోయాయి.

* * *

కోయిల ముఖం చాలా గంభీరంగా వుంది.

ఘోర్క జాతివాళ్ళ స్థావరము అక్కడికి కొంత

దూరంలో వుందో యెన్ని గంటల ప్రయాణమో అడగాలనుకున్నాడు అతడు. కాని ఆమె ముఖంచూశాక అడగాలనిపించలేదు.

ఆకాశంలో చంద్రుడుదయించాడు. చల్లటి గాలి మనసుల్ని సేదతీరుస్తోంది.

అంత క్రితంవరకు భయంకరంగా భయపెట్టిన ఆ ఎడారి, కోయిల సమక్షంలో చాలా మనోజ్ఞంగా వున్నట్టనిపించింది అతనికి.

తమ కెవరి పంతాలు పట్టింపులతో సంబంధం లేనట్టు ఒంటెలు రెండూ తమ నిర్ణీత వేగంతో ముందుకు సాగిపోతున్నాయి.

దాదాపు ఓ గంట ప్రయాణం సాగినతర్వాత అకస్మాత్తుగా వాతావరణంలో మార్పు వచ్చింది.

ఎక్కడి నుంచో ఘాటైన వాసన వారి ముక్కుపుటాల నదరగొడుతూ గాల్లో తేలివచ్చింది.

ముక్కు మూసుకున్నాడు సిద్ధార్థ భరించలేక. కోయిల మాత్రం స్థిరంగా ముందుకే చూస్తోంది. చాలా మామూలుగా చెప్పిందతనితో.

“మనం వెళ్ళే దారిలో చుర్యాచ మృగాలు తిరుగుతుంటాయి. వాటి శరీరాలమీదనుంచి వస్తూన్న వాసనే అది. అవి చాలా ప్రమాదకరమైనవి. ఏ క్షణంలోనైనా మనమీద దాడిచెయ్యవచ్చు. సిద్ధంగా వుండు” అన్నది.

చుర్యాచ మృగ మనగానే తన కిదివరకు తెలిసిన దంతమృగమేమోనని సందేహం వచ్చింది. కాని అది కాదని ఆమె చెప్పింది.

“దంతమున్న ఆ జంతువుని సింఘేళి అని పిలుస్తారు ఇక్కడివాళ్ళు. దానికన్నా యెన్నోరెట్లు బలమైనది,

చురుకై ఏదీ చుర్చా...." అని ఆమె చెప్తుండగానే ఆ ఘాటైన గబ్బువాసన చాలా సమీపంలో వారి నాసికా పుటాలని సోకింది.

"నీకు బాణాలు సంధించటం తెలుసా?" అడిగిందామె.

తెలుసునన్నట్టు తలూపాడు.

"సిద్ధంగా వుండు..." అన్నది కోయిల.

సరిగ్గా అప్పుడే వాళ్ళ కెదురైంది.

సింధేళి మృగం కన్న భారీగా వుంది. ఒంటిమీది చిన్న వెంట్రుక కూడా లేదు. సాఫీగా వుంది. దాని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తూన్న అంశం దాని ముక్కు రంధ్రాలు.

ఆ రంధ్రాలనుంచి యేదో వాయువు బయటికి వెలువడుతోంది. చిన్ని కళ్ళు, విశాలమయిన నుదురు భాగం. దాదాపు రెండు మీటర్ల పొడవుంది తోక. తోక చివర కూడా వెంట్రుకలు లేవు. దాదాపు అయిదుమీటర్ల పొడవు, మూడు మీటర్ల ఎత్తుంది.

అప్పటికే కోయిల విల్లు ఎక్కుపెట్టి సిద్ధంగా వుంది. మెల్లని స్వరంతో అతనితో చెప్పింది.

"దాని ముక్కునుంచి వెలువడుతున్న వాయువు విషపూరితమైనది. శత్రువు తనమీద దాడిచేసినప్పుడు ఆ వాయువును శత్రువు ముఖంమీదికి చిమ్ముతుంది. దాంతో ప్రాణాలు వెంటనే పోతాయి. దాన్ని ముఖాముఖి ఎదిరించి పోట్లాడలేం. విషవాయువు వదులుతుంది. అదింకా మనల్ని గుర్తించలేదు. బాణం వదులు" అంటూనే వింటినారిని చెవిదాకా లాగి బాణం వదిలింది కోయిల.

ఆమె బాణం ఇంకా దాన్ని చేరకముందే వింటినారి చేసిన శబ్దం చుర్చాని ఎలర్టు చేసింది. చాలా లాఘ

తంగా బాణం దెబ్బనుంచి తప్పించుకుంది. మరింత వేగంగా ముందు కురికింది.

సరిగ్గా అప్పుడే తన బాణం వదిలాడు సిద్ధార్థ. అది అలవాటు లేని కారణంగా గురి తప్పిపోయింది.

చుర్యా మహోగ్రంగా వాళ్ళమీద కొచ్చేసింది. దాని ముక్కులనుంచి విషవాయువు వెలువడటం తీవ్రతరమైంది.

మరోక్షణం ఆలస్యమై వుంటే చుర్యా సిద్ధార్థ మీద కురికి అతన్ని నేలకూల్చి వుండేదే!

కాని కోయిల విడిచిన రెండో బాణం సూటిగా దాని ముక్కుల్లో దూరిపోయింది. సున్నితమైన ప్రదేశం కావటంతో చుర్యా గిల గిల లాడిపోతూ ఆ నిర్జన ప్రాంతం దద్దరిల్లేలా పెడబొబ్బ పెట్టింది.

సిద్ధార్థకి బాణం వదలటానికి వ్యవధి దొరికింది. ఈ సారి అతని గురి తప్పలేదు. బాణం దాని కంఠం వద్ద బలంగా నాటుకొంది.

చుర్యా పెద్ద పర్వతంలా నేలమీదికి ఒరిగిపోయింది. దాని ముక్కుల నుంచి ఇప్పుడు ఎలాంటి వాయువు వెలువడటంలేదు.

• • •

ఒంటెలు హుషారుగా ముందుకి సాగిపోతున్నాయి.

మరో అరగంటపాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం కొనసాగింది.

ఆ తర్వాత ఉన్నట్టుండి ఒంటెలు రెండూ చటుక్కున వున్నచోటనే నిల్చుండిపోయాయి.

సిద్ధార్థ ఆశ్చర్యంగా కోయిలవైపు చూశాడు. కోయిల నేలమీదికి దృష్టి సారించి ఉలిక్కిపడింది.

అక్కడ ఇసక అతి వేగంగా కదుల్తోంది. రైసు మిల్లులో ధాన్యం వేస్తే కింది కలా దిగిపోతుందో అలా భూమి అంతర్భాగానికి అతి వేగంగా దిగిపోతోంది ఇసుక.

క్షణాల్లో అక్కడ పెద్ద అగాథం యేర్పడింది. ఆ చివర నుంచి యీ చివర వరకు అడ్డంగా పెద్ద కందకం తవ్వి నట్టు నాలు గడుగుల వెడల్పున గొయ్యి పడిపోయింది.

ఆశ్చర్యాన్ని నణచుకొంటూ ఆమెవైపు చూశాడు సిద్ధార్థ.

"ఒంటెలు చాలా సెన్సిటివ్‌గా గ్రహించాయి ప్రమాదాన్ని. లేకుంటే మన మీ అగాధంలో పడిపోయుండేవాళ్ళం. ఇదో చిన్న భూకంపంలాంటిది. అప్పుడప్పుడు నేల యిలా నెర్రెలు వేసి ఇసక భూమి అంతర్భాగానికి జారిపోతూ పెద్ద గోతుల్ని మిగుల్చుతుంది" చెప్పింది కోయిల.

సిద్ధార్థ దానికి సైంటిఫిక్ రీజన్ ఆలోచిస్తున్నాడు. బాగా ఎండిపోయిన నేల నెర్రెలు తీయటం సహజమే! భూమి అడుగుపొరలో అకస్మాత్తుగా ఖాళీ యేర్పడి ఇసక దాంట్లో కూరుకుపోయి అగాధాలు యేర్పడుతుండవచ్చు. దాన్ని కోయిల భూకంపంగా వ్యవహరిస్తోంది. ఆమెకి తెలిసిన విజ్ఞానం ఆమేది!

"ఇప్పుడెలా....? ఒంటెలు గోతిని దాటి పోగలవా మరి?"

"దాటలేవు. చిన్న గొయ్యి కాదు. నాలుగడుగుల వెడల్పున పడిపోయింది. మనం యెడమపక్కవైపు ప్రయాణం సాగించి తర్వాత మళ్ళీ కుడివైపుకి తిరిగితే ఇదే దిశలో మళ్ళీ కొనసాగుతాం" అన్నది కోయిల.

ఒంటెలు ఎడమవైపుకి మళ్ళించబడ్డాయి. సరిగ్గా అక్కడ వాళ్ళకోసం ఓ ప్రమాదం పొంచివున్న సంగతి వాళ్ళకి తెలియదు.

* * *

అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండున్నర.

"మనం తెల్లవారే లోపల ఘోర్క్ జాతి నివశిస్తున్న పొదరానికి చేరుకోగలమని భావిస్తున్నాను. తెల్లవారకుండా వెళ్ళటం చాలా అవసరం. వాళ్ళు తెల్లవారు ఝామునే గాఢనిద్రలో వుంటారు...." చెప్పింది కోయిల.

"సాధారణంగా ప్రతివారికి గాఢనిద్ర పట్టేది తెల్లవారుఝామున నే కదా....!?"

"అవునను కో! అయితే ఈ జాతివాళ్ళు రాత్రంతా గూడేలనుంచి వస్తువులు, తిండిగింజెలు జబర్దస్తీగా తెచ్చుకుంటూవుంటారు కదా! అందుకని వాళ్ళు సుఖనిద్ర పోయే సమయమే వాళ్ళ శాశ్వతనిద్రకి ముహూర్తం కావాలి."

ఆమె గొంతులో తిరుగులేని నిశ్చయం, కసి, పగ, ప్రతీకారం ధ్వనించాయి.

వాళ్ళు వెళ్తున్న దారిలో రెండు పొడవాటి పోక చెక్కల చెట్లు కనిపించాయి. ఆ చెట్ల మధ్యగా వున్న దారిగుండా పోతున్నాయి ఒంటెలు.

సరిగ్గా అప్పుడే వాళ్ళకి గాల్లో ఝుమ్మంటున్న శబ్దం వినిపించింది. గుంపుగా తేనెటీగలు చేసే శబ్దంలా వుంది.

కోయిలవైపు ప్రశ్నార్థకంగా చూసిన సిద్ధార్థ ఆమె ముఖం వివర్ణమై వుండటం గమనించి ఆశ్చర్యపోయాడు.

(ఇంకా వుంది)